క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



అబ్జర్వర్‌తో కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా (రిటైర్డ్ డీజీపీ) మంగళవారం నెల్లూరుకు వచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

టీడీపీకి గుణపాఠం చెబుదాం

• ద్రోణంరాజు రవికుమార్



నెల్లూరు(దర్గామిట్ట): అర్చకులకు వంశ పారంపర్య అర్చకత్వం ఇచ్చింది వైఎస్సార్‌సీపీనే అని, బ్రాహ్మణులను విస్మరించిన టీడీపీకి తగిన గుణపాఠం చెబుదామని ఆల్ ఇండియా బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రాహ్మణులపై చంద్రబాబు కపట ప్రేమ నటిస్తున్నారని, ఆయన ఏనాడైనా బ్రాహ్మణుల సంక్షేమం కోరారా అని ప్రశ్నించారు. బ్రాహ్మణులకు రాజకీయ గుర్తింపు ఇచ్చింది దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ఇప్పుడు ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్ బ్రాహ్మణులకు ఏం చేస్తారో చెప్పాలన్నారు.

గళ్ల పరీక్షలు తప్పనిసరి



వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రెండు వారాలకు మించి దగ్గుతో బాధపడుతున్న వారిని గుర్తించి గళ్ల పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లి పరీక్షలు చేయించాలని మండల వైద్యాధికారి కరిష్మా ఆశావర్కర్లకు సూచించారు. మంగళవారం ఆమె పీహెచ్‌సీలో ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 100 మందికి గళ్ల పరీక్షలు నిర్వహించాలన్నారు. వేసవి దష్ట్యా వడదెబ్బకు గురికాకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గర్భిణుల వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీహెచ్ఓ రాజశేఖర్‌రాజు, పీహెచ్ఎన్ సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బార్లు, మద్యం దుకాణాల్లో తనిఖీలు



కావలి: పట్టణంలోని బార్లు, మద్యం దుకాణాలను డీపీఅండ్‌ఈఓ నెల్లూరు నాగమల్లేశ్వర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రేఖ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం అమ్మకాలు, నిల్వలను పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయాలు సాగించినా, గతేడాది అమ్మకాలకు మించి విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి మేరకు 11న సాయంత్రం నుంచి 13వ తేదీ సాయంత్రం వరకు బార్లు, మద్యం షాపులు మూసివేయాలని సూచించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రాంబాబు

మనుబోలు : సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని సీఐ రాంబాబు గ్రామస్తులకు సూచించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన వీరంపల్లిలో సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని సీఐ నిర్వహించారు. అక్కడి పరిస్థితులపై స్థానికులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి గొడవలు పెట్టుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా అన్నిచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలింగ్ సందర్భంగా బయటి వ్యక్తులు, అనుమానితులు ఎవరైనా తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. శాంతి భద్రతలను కాపాడే విషయంలో స్థానికులు సహకరించాలని కోరారు. ఆయన వెంట మనుబోలు ఎస్సై అజయ్ కుమార్ ఉన్నారు.

చంద్రబాబును సాగనంపుదాం



ప్రజలకు అభివాదం చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: అధికారం కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ సంక్షేమ పథకాలు అందకుండా చేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ఓటు ద్వారా శాశ్వతంగా ఇంటికి పంపాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 32, 33, 34, 35 డివిజన్లలో మంగళవారం ఆదాల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థ సేవకులైన వలంటీర్లు అందిస్తున్న సేవలను చంద్రబాబు అడ్డుకొని అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు తదితర పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ నగదు ఇంటి వద్దనే అందకుండా చేశారని మండిపడ్డారు. పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందకుండా చంద్రబాబు కుట్రలు పన్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనాన్ని అందకుండా చేసిన చంద్రబాబును ప్రజలు క్షమించరని, ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. పింఛన్ లబ్ధిదారులైన అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు తదితరులకు గత రెండు నెలలుగా పింఛన్ నగదు ఇంటి వద్దే ఇవ్వకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారని, అందుకు కారణం చంద్రబాబేనని మండిపడ్డారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే వలంటీర్లు పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందించేవారని, తద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని చంద్రబాబు కుట్రలు పన్ని వలంటీర్లను ప్రజలకు దూరం చేశారని తెలిపారు. అలాగే జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ చేయూత, ఆసరా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఈబీసీ నేస్తం తదితర సంక్షేమ పథకాల నగదు లబ్ధిదారుల ఖాతాల్లో పడకుండా చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని అడ్డుకుంటున్న చంద్రబాబుకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, కార్పొరేటర్లు తాళ్లూరు అవినాష్, షేక్ ఫమీదా, యాకసిరి వాసంతి, ఇన్‌చార్జిలు బెజవాడ మేఘనాథ్‌సింగ్, అలగర ప్రభాకర్, షేక్ రియాజ్, యాకసిరి శరత్‌చంద్ర, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, వైవీ రామిరెడ్డి, స్వర్ణ వెంకయ్య, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు మల్లు సుధాకర్‌రెడ్డి, పాలకీర్తి రవికుమార్, ఉదయగిరి నరసింహులుగౌడ్, స్వర్ణ జీవన్‌ప్రసాద్, షాలిని, కంతర్‌ఆలీ, హయత్‌బాబా, యాకసిరి రంజిత్‌కుమార్, అజీజ్, నందూరి హరితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే జనరంజక పాలన



నెల్లూరు (బారకాసు): మహిళలతో మాట్లాడుతున్న మొయిళ్ల గౌరి



నెల్లూరు (వీఆర్సీసెంటర్): 53వ డివిజన్‌లో..

నెల్లూరు(బారకాసు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజక పాలన సాధ్యమవుతుందని, ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నగరపాలక సంస్థ పరిధిలోని బీవీనగర్, ఎన్‌జీఓ కాలనీ ప్రాంతాల్లో మహిళలతో సమావేశమై మాట్లాడారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి మహిళ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వి.విజయసాయిరెడ్డిని, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

53వ డివిజన్‌లో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్‌లో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు బాగి వెంకటరమణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ముమ్మర ప్రచారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని గాంధీగిరిజనకాలనీ, వారధిసెంటర్, పెట్రోల్‌బంక్‌గుంట తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, నెల్లూరు నగర ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



నెల్లూరు(బారకాసు): ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జయవర్ధన్ తదితరులు

ఫ్యాన్ గుర్తుకు ఓటేద్దాం

నెల్లూరు(బారకాసు): ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు జయవర్ధన్ కోరారు. మంగళవారం నగరంలోని 12వ డివిజన్ వావిలేటిపాడు, ముస్లింపాళెం(దిబ్బ) ప్రాంతాల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయవర్ధన్ మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేయాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు కాటంరెడ్డి వేణురెడ్డి, కరిముల్లా, సమద్, నజీర్‌అహ్మద్, సమీ, జమీర్, నారాయణరెడ్డి, సందాని, భక్తవత్సలరెడ్డి, పెంచలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని కిసాన్ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ నవాబుపేట విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నెల్లూరు టౌన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పుల్లమ్మసత్రం, కుసుమ ఎస్సీకాలనీ, నజీర్‌తోట, గాండ్లవీధి, డబ్బాలసందు, ముకుందాపురం, రామచంద్రాపురం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జేవీవీ మేనిఫెస్టో ఆవిష్కరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలలో మంగళవారం జనవిజ్ఞానవేదిక వారు పీపుల్స్ మ్యానిఫెస్టో బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ శ్రీనూనాయక్, విద్యాచరణ్, మోహన్‌రెడ్డి, కిషోర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆదాల గెలుపు కోసం ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపు కోసం క్రైస్తవులు నెల్లూరు రూరల్ పడారుపల్లిలోని ఏఐఎం క్రిస్టియన్ ప్రేయర్ హాల్‌లో నెల్లూరు రూరల్ అండ్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రార్థనలు చేశారు. రాజమండ్రికి చెందిన పాస్టర్ జాషువా పట్టాభి దైవ వర్తమానం అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు స్వర్ణ వెంకయ్య మాట్లాడుతూ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి, నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాలకీర్తి రవి, బెల్లంకొండ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి



అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న డీసీఓ గురప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారత స్వాతంత్ర్య పోరాట విప్లవజ్యోతి, మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని జిల్లా సహకారశాఖ కార్యాలయంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. జిల్లా సహకార శాఖాధికారి గురప్ప అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో డీసీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ ప్రతినిధులకు సన్మానం



రాజేష్‌లిలోతియాను సన్మానిస్తున్న బాలసుధాకర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏఐసీసీ నాయకులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ మంగళవారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేస్తున్న కొప్పుల రాజుకు మద్దతుగా ప్రచారం చేసేందుకు ఢిల్లీ నుంచి నెల్లూరుకు వచ్చిన ఏఐసీసీ ఎస్సీ విభాగం జాతీయ అధ్యక్షుడు రాజేష్‌లిలోతియా, అలాగే రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘ్ చైర్మన్ రాచమల్లు సిద్దేశ్వర్‌లను ఘనంగా సన్మానించారు.

బాధితుడికి ఆర్థికసాయం



నెల్లూరు(బారకాసు): పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కోవూరుకు చెందిన ధర్మకుంటా నవీన్ ఈ ఏడాది మార్చి 29న గుమ్మాలదిబ్బ ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు కావడంతో నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సుభాష్ తదితరులు ఉన్నారు.

530 పోస్టల్ బ్యాలెట్లు నమోదు



ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో మూడోరోజు మంగళవారం 530 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయగిరి నియోజకవర్గానికి సంబంధించి 2336 పోస్టల్ బ్యాలెట్లు ఉండగా, ఇప్పటి వరకు 2,207 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. మిగిలిన ఉద్యోగులు బుధవారం ఒక్కరోజే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. మిగిలిన వారు ఆర్డరు కాపీలతో నేరుగా ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోగించుకోవచ్చని ఆర్వో రాజారమేష్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(బృందావనం): వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్రైస్తవ సమైఖ్య వేదిక ప్రధాన కార్యదర్శి రెవరెండ్ రాజశేఖర్ దాసరి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ నగరంలోని విజయమహల్ గేట్ సమీపంలో ఉన్న కల్యాణ మండపంలో జిల్లా క్రైస్తవ సమైఖ్య వేదిక ఆధ్వర్యంలో 'నెల్లూరు నగర పాస్టర్లు, క్రైస్తవ సంఘీయుల సమావేశం' మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. పాస్టర్ ఐ.ఎస్.బెన్హర్ బాబు వాక్యం అందించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ దాసరి మాట్లాడుతూ జిల్లాలో క్రైస్తవ సంఘీయులు వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డికి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌కు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ క్రైస్తవ సంఘీయుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు ప్రేమ్‌చంద్, శ్యామ్, భాస్కర్, ఆనంద్‌రాజ్, ఆంథోని, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోండి

• రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్



డీకేడబ్ల్యూ కళాశాలలో పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు సిటీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ సూచించారు. నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో మూడో రోజు మంగళవారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఆర్వో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లకు అవసరమైన అన్ని సదుపాయాలను ఎన్నికల అధికారులు కల్పించాలని సూచించారు. అలాగే ఎసెన్షియల్ సర్వీసెస్ సిబ్బంది కోసం నగరంలోని బీవీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ ఓటింగ్ సెంటర్‌ను సైతం ఆర్వో పరిశీలించారు.

527 ఓట్లు నమోదు

పోస్టల్ బ్యాలెట్ ద్వారా మంగళవారం 527 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా మొత్తం 2,419 ఓట్లకు గాను ఇప్పటి వరకు 95.70 శాతం ఓట్లు పోలయ్యాయని ఆర్వో తెలిపారు. ఆయన వెంట అదనపు కమిషనర్ శర్మద, సిటీ ప్లానర్ దేవీకుమారి, ఎస్ఈ సంపత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం



మాట్లాడుతున్న ఆనం జయకుమార్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌లను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఆనం జయకుమార్ రెడ్డి అన్నారు. నగరంలోని 48వ డివిజన్‌లో మంగళవారం డివిజన్ ఇన్‌చార్జి సిద్దిక్ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ కన్వీనర్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న హిమబిందు

• ఆదాల హిమబిందు

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఆ పార్టీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కుమార్తె హిమబిందు కోరారు. నగరంలోని 17, 24 డివిజన్లలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో గత తొమ్మిదేళ్లో జరిగిన అభివృద్ధి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత 9 నెలల్లో జరిగిన అభివృద్ధికి మధ్య తేడా గమనించి ఓటు వేయాలని కోరారు. ఈ నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొండ్రెడ్డి భరత్‌కుమార్, కార్పొరేటర్ పి.సుధాకర్, ఏపీ స్టేట్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, నాయకులు పాముల రమణయ్య, మల్లిగౌడ్, సుధాకర్‌యాదవ్, కిషోర్‌రెడ్డి, చందు, 24వ డివిజన్ ఇన్‌చార్జిలు నీళ్ల సునీల్‌యాదవ్, ఉడతా మురళియాదవ్, ఇసనాక సురేంద్రరెడ్డి, కాకుటూరు లక్ష్మీసునంద, వేలూరు శ్రీధర్‌రెడ్డి, రొంపిచర్ల సుబ్బారెడ్డి, ముంగమూరు భార్గవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

మనుబోలు : పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మండలంలోని 42 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నట్లు తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. మనుబోలు జెడ్పీ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రంలో మంగళవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారని తెలియజేశారు.